ప్రజాశక్తి
ఆదివారం 13 జూలై, 2025
5
శ్రీకాకుళం



## 15న కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు ప్రకటనలో డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న కలెక్టరేట్ ముందు ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు. పిఎఫ్ఆర్‌డిఎ చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇపిఎస్ -95 డిఫెన్ట్ పెన్షన్ కిందకు అమలు చేయాలన్నారు. 8వ పే కమిషన్‌ను నియమించాలన్నారు. బకాయి పడిన డిఆర్, డిఎలు విడుదల చేయాలన్నారు. ఆరోగ్య బీమా అమలు చేయాలన్నారు. రైల్వే టిక్కెట్లతో రాయతీలు ఇవ్వాలని కోరారు.

నిలిచిన హార్బర్ పనులు



**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది ఏప్రిల్ 26న ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెం గ్రామాన్ని పర్యటించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందజేసే భృతి మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా నిలిచిపోయిన ఫిషింగ్ హార్బర్ 12 నెలల్లో పూర్తిచేస్తామన్నారు. ప్రకటించి రెండు నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట అమలు కాకపోవడంపై స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.**

# సిఎం హామీ నీటి మూట

- 15 శాతం కూడా కాని ఫిషింగ్ హార్బర్ పనులు
- ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా కదలని వైనం
- ఎదురుచూస్తున్న బుడగట్లపాలెం మత్స్యకారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో మత్స్యకారుల వలసల నిర్మూలన, జీవన ప్రమాణాల పెంపునకు బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ హార్బర్ నిర్మిస్తున్నాయి. 2023 ఏప్రిల్ 19న అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మూలపేట పోర్టు శంకుస్థాపనకు వచ్చారు. అందులో భాగంగా వచ్చి బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను రూ.365 కోట్లతో విశ్వసముద్ర సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. 15 శాతం వరకు పనులు చేపట్టారు. 504 సర్వే నంబరులో 42 ఎకరాలు ప్రభుత్వ భూమిని నిర్మాణానికి కేటాయించారు. అనంతరం 2024 మే నెల నుంచి పనులు నిలిచిపోయాయి. ఎచ్చర్ల, రణస్థలం మండలాల్లో 16 పంచాయతీల వరకు 10 వేల మంది వరకు మత్స్యకారులు ఉన్నారు. వీరి వేటకు ఈ హార్బర్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

### వేట సమయంలో మత్స్యకారులు వలసబాట

స్థానికంగా వేట అనుకూలించక మత్స్యకారులు గుజరాత్‌లోని వీరవల్, సూరత్ వంటి ప్రాంతాలకు. తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారు. హార్బర్ నిర్మిస్తే... ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి లభిస్తుంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టు సంస్థకు బిల్లులు చెల్లింపులు సక్రమంగా చేపట్టకపోవడంతో పనులు కొనసాగించలేకపోయారు. స్థానికంగా ఉన్న మత్స్యకారులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లారు. వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన హార్బర్ పనులు టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగించడానికి ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజా ప్రయోజనాలు పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం విమర్శలకు తావిస్తుంది. మత్స్యకారులు వలసలు నిర్మూలన, జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఈ హార్బర్ ఎంతో అవసరం. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా పనులు నిర్వహించాలని, సకాలంలో పూర్తిచేయాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు. ప్రారంభ సమయంలో కాంట్రాక్టు సంస్థకు 18 నెలల్లో పనులు పూర్తి చేయాలని గడువు ఇచ్చారు. గడువు పక్కన పెడితే పనులు నిలిచిపోవడం ప్రస్తుతం శాపంగా మారింది. ప్రస్తుతం రాతి కట్టడాలు, కాంక్రీటు పనులు, కాంక్రీట్ ప్లాట్ ఫారాలు, అంతర్గత రోడ్డులు ఇలా అన్ని పనులు నిలిచిపోయాయి. జాప్యం కారణంగా అంచనా వ్యయం పెరగడం, రీ టెండరింగ్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పనులు ప్రారంభించి హార్బర్ నిర్మాణం చేపట్టాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు.



### పనులు ప్రారంభించాలి



2023 ఏప్రిల్‌లో ప్రారంభించిన హార్బర్ పనుల్లో కదలిక లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు నిలిచిపోయాయి. బుడగట్లపాలెం సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 12 నెలలో పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పనులు ప్రారంభించాలి.

**- అంబటి రాంబాబు, మాజీ సర్పంచ్**

### వలసలు వెళ్తున్నారు



స్థానిక మత్స్యకారులు గుజరాత్ వంటి రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోతున్నారు. ఫిషింగ్ హార్బర్ పూర్తయితే ఈ ప్రాంత మత్స్యకారులకు చేపల వేట అనుకూలిస్తుంది. వలస వెళ్లకుండా స్థానికంగా ఉపాధి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వం త్వరితగతిన హార్బర్ పూర్తయ్యేందుకు కృషి చేయాలి.

**- ఎం.రాంబాబు, స్థానిక మత్స్యకారుడు**

### ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది



హార్బర్ పనులు ఉన్నతాధికారులు పరిశీలనలో ఉంది. ఎపి మెరైన్ బోర్డు నిర్మాణ పనులు పరిశీలిస్తుంది. మత్స్యశాఖకు సంబంధించి పూర్తిగా సహకరించాం. స్థల సేకరణతో పాటు పలు అంశాల్లో రెవెన్యూ, పారెస్టు శాఖలకు సహకరించాం.

**- వై.సత్యనారాయణ, మత్స్యశాఖ, ఎడి**



సమీక్షిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

# పెండింగ్ రైల్వే పనులు వేగవంతం

### కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- విశాఖపట్నం

జిల్లాలో పెండింగ్ రైల్వే పనులు వేగవంతం చేయాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖపట్నంలో వాల్తేర్ డివిజన్ డిఆర్ఎం లలిత్ బోహ్రా, ఇతర ఉన్నతాధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని నౌపడ రైల్వే స్టేషన్ల అభివృద్ధిపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. పనుల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా కోచ్ సూచిక బోర్డులు, లిఫ్టులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫామ్ ఎత్తును పెంచడం, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు వంటి కీలక మౌలిక సదుపాయాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే మంజూరైన 18 రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించి వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు కోరారు. శ్రీకాకుళం నుంచి నేరుగా రైళ్లు నిత్యం ప్రజల రద్దీ దృశ్య నుంచి సికింద్రాబాద్, తిరుపతికి నేరుగా రైళ్లు నడపాలన్నారు. గతిశక్తి పథకం కింద జాతీయ రహదారి 16కు అనుసంధానంగా ఉన్న హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ దగ్గర సరుకు రవాణాకు ఉపయోగపడేలాగా లాజిస్టికల్ పార్కు అభివృద్ధి చేయాలని తెలిపారు. పాతపట్నం స్టేషన్‌లో రాజారాణి ఎక్స్‌ప్రెస్‌కు, పొందూరు, శ్రీకాకుళం నుంచి పూండి వరకు స్టేషన్‌లో మరిన్ని రైళ్లకు స్టాప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా మీదుగా పూరీ-తిరుపతి, భువనేశ్వర్-విజయవాడ వందేభారత్ స్లీపర్ రైలు ప్రతిపాదనలను చేశారు.

# జిల్లాలో ఎరువుల కొరత లేదు

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ



జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతి రైతూ తమకు కావాల్సిన ఎరువులు తీసుకోవచ్చన్నారు. ఎరువులకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు ప్రభుత్వం 50 శాతం ప్రైవేటు వర్తకులు, 50 శాతం సొసైటీ, రైతు సేవా కేంద్రాలకు అందజేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో యూరియా 10583 ఎంటిఎస్, డిఎపి 6402 ఎంటిఎస్, పోటాష్ 922 ఎంటిఎస్, కాంప్లెక్స్ 3084 ఎంటిఎస్, సూపర్ పాస్పేట్ 842 ఎంటిఎస్ సరఫరా చేశామన్నారు. ఇందులో రైతు సేవా కేంద్రాలకు 50 శాతం పంపిణీ చేశామని వివరించారు. ప్రస్తుతం ఈ నెల 11 నాటికి ఎపి మార్కెఫెడ్ వద్ద ఉన్న నిల్వలు యూరియా 5692.365 ఎంటిఎస్, డిఎపి 215.0 ఎంటిఎస్, 5,292.0 ఎంటిఎస్ అందుబాటులో ఉందన్నారు. జి.సిగడాం మండలంలో యూరియా 314.595 ఎంటిఎస్, డిఎపి 302 25 ఎంటిఎస్, పొటాష్ 25.0 ఎంటిఎస్, 129. 25 ఎంటిఎస్, 17.0 ఎంటిఎస్, 2788.095 ఎంటిఎస్ ఇప్పటికే సరఫరా చేశామన్నారు. జి.సిగడాం మండలంలోని రైతు సేవ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు యూరియా 239 ఎంటిఎస్, డిఎపి 80.0 ఎంటిఎస్, మండల వ్యవసాయ అధికారి ప్రతిపాదనలు మేరకు మొత్తం 319.76 ఎంటిఎస్ సరఫరా చేశామన్నారు. ఇంకా ఈ వారంలో యూరియా 140.0 ఎంటిఎస్ సరఫరా చేయడానికి మార్కెఫెడ్ ద్వారా ప్రతిపాదనలు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఏప్రిల్ 1 నాటికి ప్రారంభ నిల్వ సుమారు 15129 ఎంటిఎస్, జూలై 10 నాటికి సరఫరా అయ్యాయని అన్నారు. ప్రసుతం ఉన్న నిల్వలు, కావాల్సిన ఎరువుల విషయమై రాష్ట్ర కార్యాలయానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

# జిల్లాలో అభివృద్ధి శూన్యం

### మాజీ మంత్రి ధర్మాన

**శ్రీకాకుళం రూరల్:** జిల్లా అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం అస్సలు దృష్టిసారించిన సందర్భం ఒక్కటంటే ఒక్కటీ లేదని, మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆవేదన చెందారు. స్థానిక జిల్లా వైసిపి కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది కాలం పాలనలో కనీసం రూ.వెయ్యి కోట్లు కూడా ఈ ప్రాంతం అభివృద్ధికి కేటాయించలేకపోయారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గొంతు విప్పి మాట్లాడలేకపోతున్నారని అన్నారు. బిజెపి అయితే ఎన్నికలకు ముందే చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోతో మాకేంటి సంబంధమని సభాముఖంగానే వాళ్ల నాయకులు సైడ్ అయిపోయారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి వైసిపి నాయకులు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఏడు దశాబ్ధాలకు పైగా పార్టీలకతీతంగా ఈ ప్రాంతం అన్యాయానికి గురవుతూనే ఉందన్నారు. దాహార్తి తీర్చే, మన పంటలకు నీళ్లిచ్చే వంశధార ప్రాజెక్టు పూర్తికే యాభై ఏళ్లు పట్టిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి దృష్టిసారించి ఆఫ్‌షోర్, తోటపల్లి, నారాయణపురం నిధులు వెచ్చించింది మాజీ సిఎం జగన్ అని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెంటాడ పద్మావతి, గేదెల పురుషోత్తం, యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు, అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షులు సాధు వైకుంఠరావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రసాదరావు



సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

# అర్హుల జాబితా సిద్ధం చేయాలి

### వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి :** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి స్థలాలను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ అంశాలపై పలాస, టెక్కలి డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారులతో శనివారం సమీక్షించారు. ప్రస్తుతం గృహ నిర్మాణ లేఅవుట్లలో ఎంతమంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొన్నది, నిర్మాణాలు చేపట్టాల్సిన లబ్ధిదారుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నందిగాం మండలంలోని లే అవుట్‌లో 1453 గృహాలు అర్హులకు మంజూరు చేయగా, 236 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించారని అధికారులు తెలిపారు. 1021 ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సొంతింటి కల సాకరానికి అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టెక్కలి, పలాస ఆర్‌డిఒలు ఎం.కృష్ణమూర్తి, వెంకటేష్‌లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి :** సమాంతర అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అన్నారు. మండలంలోని దండుగోపాలపురంలో ఉపాధి హామీ నిధులతో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత రహదారులను ప్రారంభించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# పోలీసుల గుప్పిట్లో ఫరీదుపేట

### గోపి అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఫరీదుపేటలో వైసిపి నాయకుడు, పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్, ఉప సర్పంచ్ పుణ్యవతి భర్త సత్తారు గోపి ప్రత్యర్థుల చేతిలో శుక్రవారం దారుణ హత్యకు గురయ్యారు. శ్రీకాకుళం రిమ్స్‌లో శనివారం పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అంబులెన్స్‌లో మృతదేహం తీసుకొచ్చి అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిసేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. 400 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రధాన కూడళ్ల వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యక్ష, పరోక్ష నేరంలో సంబంధం ఉన్నట్లు గుర్తించి 12 మందిపై కేసు నమోదు చేశారు. నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. గతంలో చోటుచేసుకున్న నేర సంఘటనలు, భవిష్యత్‌లో నేర నియంత్రణ లక్ష్యంగా పోలీసుల చర్యలు కొనసాగుతున్నాయి. విజయనగరం మాజీ పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హత్యకు గురైన వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామంలో పోలీసులు తాకిడి, తరచూ జరుగుతున్న సంఘటనలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొందరు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎంపిపి మొదలవలస చిరంజీవి, ఇతర నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.




కూడలిలో ఉన్న పోలీసులు

# సెలవు రోజుల్లో తరగతులు వద్దు

### కార్పొరేట్ కళాశాలల తీరుపై ఎస్ఎఫ్ఐ మండిపాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రెండో శనివారం కార్పొరేట్ విద్యా సంస్థలు శ్రీచైతన్య, నారాయణ జూనియర్ కళాశాలలు నిర్వహణపై ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు మండిపడ్డారు. నగరంలోని కార్పొరేట్ కళాశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలు సందేహాలు నివృత్తి అనే పేరుతో క్లాసులు చెప్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 80 రోడ్డులోని నారాయణ కాలేజీపై చాలా ఆరోపణలు వస్తున్నా... విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రెండో శనివారం తరగతులు పెట్టడం, అధిక ఫీజులతో కాలేజ్ నడిపించడం, పుస్తకాలు, యూనిఫారాల పేరుతో విద్యార్థులపైన ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి పి.ఖగేష్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.జై.రామ్, శ్రీకాకుళం హాస్టల్ కమిటీ సభ్యుడు వీరాజ్, టౌన్ కమిటీ సభ్యుడు గోవర్ధన్ పాల్గొన్నారు.



తరగతులను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# బడుల్లోనూ డబుల్ గేమ్‌లేనా?




ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా షోలతో నెట్టుకొచ్చేయడం ఇటీవల మనం తరచూ చూస్తున్నాం. ఒక ఈవెంట్‌ను తీసుకుని దానికి రకరకాల కలరింగ్ ఇవ్వడం, ప్రజలంతా అటు వైపే ఆలోచించేలా చేయడం పాలకులకు పరిపాటిగా మారింది. ప్రజలు తమ సమస్యలపై ఆలోచించనీయకుండా, అమలు చేయని హామీలపై వారు నిలదీయకుండా డైవర్షన్ రాజకీయాలు చేయడం పాలకులు ఇటీవల ఒక అస్త్రంగా చేసుకున్నారు. అందులో భాగంగా విశాఖలో గత నెల 21న నిర్వహించిన యోగా డే కోసం ప్రభుత్వం ఎంత హడావుడి చేసిందో మనకు తెలిసిందే. జిల్లాలో నెల రోజులు పాటు యోగాంధ్ర పేరుతో రకరకాల కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా సమస్యలను, అభివృద్ధి పనులను పక్కన పెట్టి మరీ ఈ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చిన విషయం చూశాం. యోగాడే ఏర్పాట్లు మరో ఎన్నికల సమయంలో ఉండే హడావుడిని తలపించేలా అధికార యంత్రాంగాన్ని కేంద్రీకరించింది. యోగా డే రోజు, ముందు రోజయితే అధికారులకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం ఈ నెల పదో తేదీన నిర్వహించిన మెగా పిటిఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్) కూడా దాదాపు అదే స్థాయిలో నిర్వహించింది. నెల రోజులుగా దానిపైనే విద్యాశాఖ దృష్టి కేంద్రీకరించింది. ప్రైవేట్ పాఠశాలల్లోనూ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో పాటు ఒక ప్రత్యేక అధికారినీ నియమించింది. దీంతో తప్పనిసరిగా వారూ సమావేశాలను నిర్వహించాల్సి వచ్చింది. ప్రైవేట్ పాఠశాలల్లో రాజకీయ పార్టీలకతీతంగా సమావేశాలు జరగ్గా, ప్రభుత్వ బడుల్లో మాత్రం పేరెంట్-టీచర్స్ - టిడిపి నాయకులతోనే సాగింది. బడుల్లోనూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి అంశాలపై నేతలు ప్రసంగాలతో ఊదరగొట్టారు.

మెగా పిటిఎంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బాబు మాటలు వింటే ప్రభుత్వ పాఠశాలలపై ఇంత ప్రేమ ఉందా? అనిపించేలా ప్రసంగించారు. ప్రభుత్వ, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో సీట్లు లేవు అని బోర్డు పెట్టే పరిస్థితి రావాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ బడులను ఆ విధంగా తీర్చిదిద్దితే కచ్చితంగా బాబు మాట నిజయయ్యే రోజులు ఎంతో దూరంలో లేవు. బాబు పైకి ఆ రకంగా మాటలు చెప్తున్నా అంతర్గతంగా తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం ప్రభుత్వ బడుల స్థితిగతులను మరింత దిగజార్చాయన్నది వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే అవగతమవుతుంది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద రెండో విడతలో 1054 స్కూళలో తొమ్మిది రకాల అంశాలతో పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు నాటి ప్రభుత్వం రూ.416.89 కోట్లను మంజూరు చేసింది. ఇందులో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు శ్లాబ్ రిపేరు పనులు, మరుగుదొడ్ల నిర్మాణం, కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయడం తదితర పనులు ఉన్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోయే నాటికి రూ.167.74 కోట్లతో పనులను చేయగలిగారు.

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడు పథకాన్ని మన బడి-భవిష్యత్‌గా మార్చింది. మన బడి-భవిష్యత్‌కు సంబంధించి విధాన పరమైన నిర్ణయం తీసుకోవాలని, అంతవరకూ ఎటువంటి పనులూ చేపట్టొద్దంటూ ప్రభుత్వం గతేడాది జూన్‌లో ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పనులు నిలిచిపోవడంతో పాటు నిర్మాణ పనులకు పంపిణీ చేసిన 4,725 సిమెంట్ బస్తాలు వినియోగించేందుకు వీలు లేకుండా సిమెంట్ గడ్డకట్టుకుపోయింది. వీటితో పాటు టన్నుల కొద్దీ ఇనుము తుప్పపట్టిపోయింది. ఏడాది కాలంగా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోని ఫలితంగా కోట్ల రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారింది. పాఠశాలలు మొండి గోడలతో దర్శనం ఇస్తున్నాయి. తలుపులు, కిటికీలు బిగించకుండా కొత్త భవనాలను అలానే ఉంచేయడంతో వెక్కిరిస్తున్నాయి. మరుగుదొడ్లు లేక కారుతున్న భవనాల్లోనే విద్యార్థులు చదువులు సాగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇది ఒక్క శ్రీకాకుళం జిల్లాకే పరిమితం కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. వాస్తవాలు ఇలా ఉంటే చంద్రబాబు మాటలు మరోలా ఉన్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతామంటూ బాబు చెప్పుండటాన్ని ప్రజలు ఎలా విశ్వసించగలరు. చివరకు టిడిపి కూటమి ప్రభుత్వం బడుల్లోనూ డబుల్ గేమ్‌ను ఆడుతోందా? అని జనం అనుకునేలా వ్యవహరించడం ప్రభుత్వ ఇమేజ్‌కే డ్యామేజ్. ఇది రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం సడలిపోయి, ప్రభుత్వానికి, కూటమి పార్టీలకు చేటు కలిగించనుంది.



మాట్లాడుతున్న నరసింహ వెంకటేష్

## జీడి పరిశ్రమలు పరిశీలన

**ప్రజాశక్తి- పలాస**

తమిళనాడు రాష్ట్రం ప్రిన్సిపాల్ సెక్రటరీగా పనిచేస్తున్న టి.నరసింహ వెంకటేష్ శనివారం జీడి పరిశ్రమలను సందర్శించారు. ముందుగా ఆర్‌డిఒ జి వెంకటేష్ ఆయనను ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం పలాస ట్రిబుల్ ఎస్ జీడి పరిశ్రమను పరిశీలించారు. పలాసలో ఎన్ని జీడి పరిశ్రమలు ఉన్నాయి...? లాభాలు ఎంత శాతం వస్తుంది...? కార్మికులు ఎంత మంది ఉన్నారు...? కార్మికులకు ఎటువంటి ప్రాతిపదికన వేతనాలు చెల్లిస్తున్నారు...? జీడి పిక్కలు ఎక్కడ నుంచి దిగుమతి చేస్తుంటారు...? తయారు చేసిన జీడి పప్పు ఏయే ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు...? వ్యాపారం చేసేందుకు ప్రభుత్వం ఎటువంటి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నారా తదితర అంశాలను వ్యాపారులకు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం కూడా జిల్లాలో పర్యటించనున్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఆర్ఐ కంచరాన ఖగేశ్వరరావు, జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.

## జనసేన బలోపేతమే లక్ష్యం

**ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ**

జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం దిశగా పని చేయాలని పార్టీ క్యాడర్‌కు జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. జనసేన ఉమ్మడి జిల్లా కార్యాలయంలో శ్రీకాకుళం నియోజకవర్గ జనసేనపార్టీ సమావేశం శుక్రవారం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో, ప్రత్యేకంగా శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో, పట్టణంలో, డివిజన్‌లో ముగ్గురు క్రియాశీల జనసేన నాయకులకు, క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతం కోసం బాధ్యతలు అప్పగించనున్నట్లు చెప్పారు. ముగ్గురు చొప్పున తాత్కాలిక కో-ఆర్డినేటర్లను నియమించామని అన్నారు. స్థానిక సంస్థలలోపు పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ అదేశాలను పాటిస్తున్నట్లు తెలిపారు. పార్టీలో యువతకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దానేటి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు భూపతి అర్జున్ కుమార్, జిల్లా కార్యదర్శి కొండా ఉద్యయ్ శంకర్ పాల్గొన్నారు.

## బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**



గిరిధర్

2025 జూన్ నెలలో జరిగిన ఎపోర్షన్, ప్రమోషన్లు, బదిలీల కౌన్సిలింగ్ కారణంగా కొత్త పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయుల్లో కొంతమందికి నూతన క్యాడర్ స్ట్రెంత్ ప్రభుత్వ ఆమోదం ఇప్పటికీ పొందనందున ఆయా ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ప్రకటనలో డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించడం జరగలేదని, దాని కారణంగా వారి జీతాల ఖాతాల నుంచి చేయాల్సిన మినహాయింపులు, బ్యాంకులు తదితర సంస్థలకు చెల్లించాల్సిన ప్రీమియంలు చెల్లించలేక పోతున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, రాష్ట్ర అధికారులు వెంటనే స్ప ందించి నూతన క్యాడర్ స్ట్రెంత్‌ను ఆమోదించి సంబంధిత అధికారులకు ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగినందున విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి అందించాలని కోరారు. విద్యారంగంలో అనవసర ప్రయోగాలు, బోధనేతర కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, బోధనకు అవకాశం కల్పించి ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## టిడిపి మండల అధ్యక్షునిగా సురేష్



సురేష్

**లావేరు:** లావేరు టిడిపి మండల అధ్యక్షునిగా ముప్పిడి సురేష్ ఎన్నికయ్యారు. ఈయన 9వసారి టిడిపి మండల అధ్యక్షునిగా ఎన్నికవ్వడంతో టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల ప్రధాన కార్యదర్శిగా బెజ్జపురం గ్రామానికి చెందిన పిన్నింటి మధుబాబు నియామకమయ్యారు.

### అచ్చెన్నాయుడును కలిసిన సురేష్

లావేరు టిడిపి మండల అధ్యక్షునిగా ఎన్నికైన ముప్పిడి సురేష్ వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని మంత్రి సూచించారు. ఈయనతో టిడిపి మాజీ జిల్లా అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, కాళింగ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, డిసిసిబి చైర్మన్ చౌదరి అవినాష్, తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహనరావు, లావేరు మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, గొర్లె శ్రీనువాసరావు, సాయికుమార్, దారపురెడ్డి కూర్మారావు తదితరులున్నారు.

## ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్

**శ్రీకాకుళం సిటీ:** ప్రణాళిక బద్ధంగా చదివితేనే బ్యాంకింగ్ వ్యవస్థలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ పి.రాజా తెలిపారు. శ్రీకాకుళం రూరల్ నైర వ్యవసాయ కళాశాలలో శుక్రవారం అసోసియేట్ డీన్ డా. జి.జోగినాయుడు ఆధ్వర్యంలో బ్యాంకింగ్ ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగాల్లో అవకాశాలపై విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఇదే కళాశాలలో చదువుకున్న ఆయన ఈ స్థాయికి రావడానికి నైర కళాశాల ఎంతగానో దోహద పడిందని తెలియజేశారు. అనంతరం కళాశాల డీన్ మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించాలంటే సమయపాలన, ఏకాగ్రత ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డా. పి.గురుమూర్తి, డా.ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

## డ్రైనేజీతో అవస్థలు



వసతిగృహం వద్ద ఉన్న మురుగునీరు

**నరసన్నపేట:** నరసన్నపేట పట్టణంలో సాంఘిక సంక్షేమ వసతిగృహం సమీపంలో డ్రెయినేజీ వ్యవస్థ లీకులు అవ్వడంతో బాలికలకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులు తల్లి దండ్రులు శనివారం విలేకరు లతో మాట్లాడారు. ఈ వసతిగృహానికి ఆణించి ఉన్న డ్రెయినేజీని పరిశుభ్రంగా చేయకపోవడం వల్ల బాలికల వాడిన నీరు భయటకు వెళ్లడం లేదన్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు, క్రిమి కీట కాలు చేరుతున్నాయని, దీంతో జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## పశుగ్రాసంతో పాల ఉత్పత్తి



అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖరరావు

**నందిగాం:** పాడి పశువులకు పశు గ్రాస అందిస్తే అధిక పాల దిగుబడిస్తుందని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖర రావు అన్నారు. పసుగ్రాస వారోత్స వాల్లో భాగంగా మండలంలోని మొండి రావివలసలో పశువుల పెంపకందారులకు మేత ఉత్పత్తి ప్రాధాన్యతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగు భూమిలో కనీసం పది శాతం పశుగ్రాసం ఉత్పత్తి చేయాలని సూచించారు. పచ్చని గడ్డితో ఆహారం ఇవ్వడం వల్ల జంతువు ఆరోగ్యంగా, పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సీపురం పశువైద్యాధికారి జి.మన్మథరావు, సహాయకుడు శ్రీనివాసరావు, గోపాలమిత్ర రమణ పాల్గొన్నారు.

# పాలవలస హైస్కూల్‌లో సమస్యలు తిష్ట

- ఆరుబయటే భోజనాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు



సైకిల్ షెడ్‌లో వంటలు చేస్తున్న వంట కార్మికులు

**ప్రజాశక్తి- బూర్జ**

మండలంలోని పాలవలస గ్రామంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సమస్యలు తిష్ట వేశాయి. మండలంలోని ఉన్న ప్రధాన హైస్కూల్లో పాలవలస హైస్కూల్‌లోనే అధికశాతం మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, అలాగే పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నప్పటికీ పాఠశాలలో పేరుకుపోయిన సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి.

### ఆరుబయట భోజనాలు

పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నప్పటికీ విద్యార్థులు భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేకపోవడంతో ఆరుబయతే భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విద్యార్థులు వాపోతున్నారు. ముఖ్యంగా భోజన సమయంలో గ్రామంలోని శునకాలు కూడా పాఠశాలలో ప్రవేశించడంతో శునకాలతో సావాసం చేయాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

### ఏర్పాటు కానీ కళావేదిక

పాఠశాలలో అనునిత్యం ఉదయం, సాయంత్రం ప్రార్థన చేసుకునేందుకు కళావేదిక లేకపోవడంతో ఆరుబయటే ప్రార్థనలు చేయాల్సిన పరిస్థితి ఉందని విద్యార్థులు పేర్కొన్నారు.

### ఒకరే ఆయమ్మ...

250 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలకు ఒక్కరే ఆయమ్మను ఏర్పాటు చేయడంతో పలు ఇబ్బందులు చోటు చేసుకుంటున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

### ఆరుబయటే వంటలు..

మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంటలు చేసుకునేందుకు ఉన్న భవనం శిధిలావస్థకు చేరుకోవడంతో సైకిల్ స్టాండ్‌లోనే ఆరుబయట వంటలు చేస్తున్నారు. అయి తే వర్షం ఎక్కువగా పడేటప్పుడు అవస్థలు ఎదుర్కొం టున్నామని వంట కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సైకిళ్లకు రక్షణ కరువు



వరండాలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల సైకిళ్లకు రక్షణ కరవైందని, ఆరుబయట సైకిళ్లు ఉంచడం వలన సైకిళ్లు చోరీకి గురవుతున్నాయని, ముఖ్యంగా ఎండ, వానల నుంచి రక్షణ కరువైందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డైనింగ్ హాల్, కళావేదికలను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా సైకిళ్లకు రక్షణ కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

ఇదే విషయాన్ని హైస్కూల్ హెచ్ఎం ప్రతాప్ రుద్ర వద్ద ప్రస్తావించగా పాఠశాల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. పాఠశాలలో పలు సమస్యలతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నాం. అయితే ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే కొంతవరకు సమస్యలు పరిష్కారవుతాయి.

### వర్షం వస్తే అంతే....



హైస్కూల్‌కు వంటశాల లేకపోవడం వలన ఆరుబయట భోజనాలు చేస్తున్నాం. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుం డడంతో ఒక్కోసారి తడిసి ముద్ద అవుతున్నాం. అధికారులు, ప్రభుత్వం చొరవ చూపి డైనింగ్ హాల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

- కె.రాఘవి, విద్యార్థిని, పాలవలస హైస్కూల్



పాలవలస హైస్కూల్



భోజనాల కోసం ఎండలో క్యూలో నిల్చున్న విద్యార్థులు

### కళావేదిక లేదు



పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉన్నాం. కళావేదిక లేదు. కళావేదిక ఏర్పాటుకు దాతలతో పాటు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. సైకిల్ స్టాండ్ ఏర్పాటుతో పాటు వంటశాల ఏర్పాటు చేయాలి.

- పి.మౌనిక, పదో తరగతి విద్యార్థిని, పాలవలస హైస్కూల్

## మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శ్రీరాములు నాయుడు

**ప్రజాశక్తి- బూర్జ**



శ్రీరాములు నాయుడు

ఆముదాలవలస మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బూర్జ మండలం అన్నంపేటకు చెందిన మజ్జి శ్రీరాములు నాయుడు నియమితు లయ్యారు. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయం నుంచి ప్రకటన వెలవడింది. టిడిపి ఆవిర్భావం నుంచి దశాబ్దాల కాలంగా టిడిపిపై మక్కువతో రాజకీయ రంగ ప్రవేశం చేయడం జరిగిందని శ్రీరాములు నాయుడు ప్రజాశక్తితో తెలిపారు. ఆనాటి నుంచి నేటివరకు పార్టీ క్రియాశీలక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు న్నానన్నారు. గతంలో తాను 2005 నుంచి 2008 వరకు స్టేట్ లీగల్ సెక్రటరీగా, 2006లో బూర్జ మండలం అన్నంపేట పంచాయతీ సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టానని తెలిపారు. పార్టీ కోసం చేసిన సేవలే తనకు గుర్తింపునిచ్చాయని తెలిపారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. డైరెక్టర్లుగా జి.రమేష్, కె.భారతి, డి.ప్రభావతిలను ప్రభుత్వం నియమించింది.



పిచికారీ చేస్తున్న కార్మికుడు

## దోమల నివారణకు చర్యలు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

ప్రజారోగ్య అధికారి డాక్టర్ పి.సుధీర్‌కుమార్ నేతృత్వంలో నగరంలో దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా పారిశుధ్య కార్మికులతో కాలువలు, డ్రైన్లలో దోమల నివారణా మందును పిచికారీ చేయించారు. అదేవిధంగా అధిక మొత్తంలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలను విడుదల చేశారు. నగర ప్రాంతంలోని ప్రజలందరూ ఫ్రైడే డ్రైడేని తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, తద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని సుధీర్‌కుమార్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేపై తప్పడు ప్రచారం తగదు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్‌పై తప్పుడు ప్రచారం తగదని శ్రీకాకుళం రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు మూకళ్ల శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రౌడీ షీటర్‌కు ఎమ్మెల్యే పోలీస్ కేసుల్లో సహకరించలేదని, మార్ఫింగ్ ఆడియో రికార్డులతో యూట్యూబ్ ఛానళ్లలో తప్పుడు ప్రచారం జగుతుందన్నారు. రెండేళ్ల పాటు సొంత నిధులతో అన్న క్యాంటిన్ నడిపిన చరిత్ర ఎమ్మెల్యేదన్నారు. కొందరు కావాలని ఎమ్మెల్యేను బ్యాడ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన చేస్తున్న సేవ, మంచితనం, చరిత్ర నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, ముద్దాడ రామకృష్ణ, పంచిరెడ్డి అప్పల నాయుడు పాల్గొన్నారు.

## ఘనంగా నాబార్డు ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాశక్తి- బూర్జ**

మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శనివారం 44వ నాబార్డ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ నాబార్డ్ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించడానికి పెట్టుబడి, ఉత్పత్తి క్రెడిట్‌ను అందించే సంస్థలకు అత్యున్నత ఆర్థిక సంస్థగా పనిచేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కుటీర, చిన్న పరిశ్రమల స్థాపనకు సహాయం అందిస్తుందన్నారు. నాబార్డ్ సహకారంతో 1998 ఆర్ట్స్ సంస్థ నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రైతు క్లబ్స్ ద్వారా మహిళా శిక్షణ కార్యక్రమాలు, వాటర్ షెడ్ ద్వారా సహజ వనరుల అభివృద్ధి, మాతోట ద్వారా 1000 ఎకరాల్లో 1030 మంది రైతులతో జీడి, ఉసిరి, అంతర పంటలు చేసి రైతుల అదనపు ఆదాయం పొందే కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ ఎఫ్‌పిఒ కో-ఆర్డినేటర్ నూక అనూప్, మన్యం సహజ సిఇఒ శంకర్, ఆర్ట్స్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## జనసేన నాయకులకు సముచిత స్థానం



రాజును సన్మానిస్తున్న నాయకులు

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛా పురం మార్కెట్ కమిటీలో జనసేన నాయకులకు సముచిత స్థానం కల్పించి ఒక వైస్ చైర్మన్, డైరెక్టర్లకు అవకాశం కల్పించారు. దీంతో జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజుకు శనివారం సన్మానించారు. మార్కెట్ కమిటి వైస్ చైర్మన్‌గా దాసరి శేఖర్, సభ్యులుగా బడే రాజు, దుంగు హేమలత, పిఎసిఎస్ సభ్యులుగా బాసి భారతీరెడ్డి, భూదేవి, మహాలక్ష్మిలను నియమించారు.

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

**ప్రజాశక్తి- కొత్తూరు**



మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగించడం ఆపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లి పంచాయతీలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాక్సిస్, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ట్రూ అప్, సర్‌ఛార్జీలు రద్దు చేయాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్ల వద్దు... పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ... సిపిఎం నాయకులు ఇంటింటి ప్రచారం చేపడతామన్నారు. యూనిట్ విద్యుత్‌ను రూ.4.60లు చొప్పున కొనుగోలు చేసేందుకు యాక్సిస్ కంపెనీతో రాష్ట్ర డిస్కామ్ లు కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు సిఎం చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి... అధికారంలోకి వచ్చిన తరువాత రెట్టింపు ఛార్జీల పెంచారని అన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ట్రూ అప్ ఛార్జీలు, సర్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిఎడల ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, పి.రమేష్, మోహన్, జమ్మయ్య, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారాం

## మోసం బాబు నైజం

**ప్రజాశక్తి- టెక్కలి రూరల్**

ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్స్ సిక్స్ హామీలన్నీ అధికారంలోకి వచ్చాక అబద్దాలుగా మారాయని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా పరిశీలకుడు కంభంపాటి రవికుమార్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఓ కళ్యాణ మండపంలో వైసిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వంశధార, నాగావళి నదుల్లో ఇసుక అక్రమంగా తరలిస్తుంటే అధికారుల దాడులు లేవన్నారు. కింజరాపు సోదరులు మైనింగ్ మాఫియా నడుపుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో శ్వాశతమైన ప్రాజెక్టు ఒక్కటైనా నిర్మించారా? అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో మూలపేట పోర్టు, పలాస కిడ్నీ ఆస్పత్రి నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, పాల వసంతరెడ్డి, పేరాడ భార్గవి, ఎంపిపిలు నడుపూడి శ్రీరామ్మూర్తి, రోణంకి ఉమామల్లయ్య, ఆట్ల సరోజినమ్మ, సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్, వైసిపి మండల అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సంపతరావు హేమసుందరావు, యర్ర చక్రవర్తి పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ప్రజాశక్తి- ఆమదాలవలస**



రహదారిని నిర్మిస్తున్న స్థానికులు

పురపాలక సంఘానికి చెందిన 18వ వార్డు పరిధిలోని కళింగనగర్ వాసులు తమ కాలనీలో మౌలిక సదుపాయాల కరువై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, అధికారులు స్పందించకపోవడంతో శనివారం స్థానికులే స్వయంగా చందాలు వేసుకుని మట్టి రహదారిని నిర్మించారు. జెసిబి సహాయంతో రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేసి రహదారిని ప్రయాణయోగ్యంగా తీర్చిదిద్దారు. కాలనీ వాసులు మాట్లాడుతూ తాము ప్రతి సంవత్సరం అన్ని పన్నులు చెల్లిస్తున్నా, మా ప్రాంత అభివృద్ధిని పాలకులు, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఎవ్వరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో పారిశుధ్యం, రోడ్లు, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలపై పురపాలక సంఘం దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కార్యక్రమంలో పైడి రామారావు, సువారి నర్సింగరావు, సీపాన ఈశ్వరరావు, ఎన్.దుర్గారావు, జి.రమణమూర్తి, శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలను స్వీకరిస్తున్న సూర్యనారాయణ

## రైతుల అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి**

సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన తనకు జిల్లా రైతులందరికీ సేవలందించే పదవి లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శనివారం కొత్తకోట సహకార సంఘ అధ్యక్షులుగా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ తనకు కల్పించిన బాధ్యతలను రైతులందరికీ సేవలందిస్తూ సద్వినియోగం చేసుకుంటానన్నారు. గత వైసిపి పాలనలో జిల్లాలో ఎన్నో సహకార సంఘాల పాలకవర్గాలు, ప్రభుత్వ అధికారులు కలిసి నిధుల దుర్వినియోగంతో పాటు రైతులను తప్పుదోవ పట్టించారన్నారు. జిల్లాలో అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి తనవంతు సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో సిఇఒ బివి సన్యాసిరావు, విశ్రాంత ఎంపిడిఒ మునగవలస రవీంద్రబాబు, టిడిపి మండల అధ్యక్షులు అంబల్ల రాంబాబు, కొత్తకోట సర్పంచ్ సురవరపు జగదీష్, టిడిపి నాయకులు నందివాడ గోవిందరావు, కందుల వెంకటరావు, మీసాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌తో శారీరక దృఢత్వం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

బ్యాడ్మింటన్ క్రీడతో మానసిక దృఢత్వం, మానసిక ఉల్లాసంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియంలో బాడ్మింటన్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలకు వేదిక జిల్లా అని, క్రీడల్లో బాడ్మింటన్‌కు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ఒలంపిక్‌లో దేశ కీర్తిని ఇనుమడింపజేసిన ఘనత కరణం మల్లేశ్వరిని గుర్తుచేసుకోవాలన్నారు. అదే ఘన కీర్తిని బాడ్మింటన్‌లో క్రీడాకారులు సాధించి జిల్లా పేరును బారతదేశంతోపాటు, ప్రంచదేశాలకు తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. శ్రీకాకుళాన్ని ముఖ్యమైన క్రీడాప్రదేశంగా గుర్తింపునకు సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ శిర రమణయ్య, బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష బృందం, నాయకులు పాల్గొన్నారు.

### మత్స్యకారులకు అండ

మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగర పరిధి మత్స్యశాఖ కార్యాలయంలో మత్స్యకారులకు సబ్సిడీతో బోటు ఇంజన్‌లు, పరికరాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుపేదల ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయతీలు సద్వినియోం చేసుకోవాలన్నారు. బందరువాని పేట గ్రామానికి చెందిన 52 మంది మత్స్యకారులకు రూ.67.85 లక్షలు విలువైన బోట్లు అందజేసినట్లు చెప్పారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40 శాతం రాయితీ, అదనంగా మరో 10 శాతం రాయితీ మొత్తం 50 శాతం కలిపి అందజేసినట్లు చెప్పారు. అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ రమణయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



బాడ్మింటన్ క్రీడాకారులతో ఎమ్మెల్యే గొండు శంకర్

## సీనియర్ న్యాయవాది మృతి

**టెక్కలి :** టెక్కలి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఖజానా వెంకటరావు శనివారం స్వగృహంలో మృతి చెందారు. కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల హైదరాబాద్‌లో శాస్త్ర చికిత్సకు చేయించుకున్నారు. తేరుకుంటున్న సమయంలోనే పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆదివారం టెక్కల్లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. వెంకటరావు మృతిపై టెక్కలి బారు అసోసియేషన్ అధ్యక్షులు పినకన అజయ్ కుమార్, న్యాయవాదులు దివ్వెల వివేకానంద, వైకుంఠ రావు, పాణిగ్రాహి పేడాడ బాబూరావు, సాయిరాజ్, పైల చంద్రుడు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## అనారోగ్యంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

**రణస్థలం:** మండలంలోని గొర్లెపేటకు చెందిన వైసిపి నాయకులు మహంతి పెదరాము నాయుడు అన్నయ్య మహంతి అప్పలస్వామి కుమారుడు మహంతి సంతోషి నాయుడు (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) అనారోగ్యంతో శనివారం విశాఖపట్నం ఎబిసి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని స్వగ్రామం గొర్లెపేటకు తీసుకుని వచ్చి అంత్య క్రియలు నిర్వహించారు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు సందర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



చీడివలస వద్ద ఇసుక లారీలను అడ్డుకున్న యువత

## ఇసుక లారీలు అడ్డగింత

**బూర్జ:** ఇసుకలోడులతో వెళ్తున్న లారీలను మండలంలోని చీడివలస గ్రామస్తులు శనివారం సాయంత్రం అడ్డగించారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం తమరాం గ్రామ సమీపంలో ఉన్న నాగావళి ఇసుక ర్యాంపు నుంచి అనునిత్యం రాత్రింబవళ్లు ఇసుకలోడ్లుతో లారీలు రాకపోకల వలన గ్రామంలో రోడ్లన్నీ గోతులమయంగా తయారయ్యాయని యువత తెలిపారు. అంతేకాకుండా లారీలు రాకపోకల సమయంలో దూళి విపరీతంగా రావడంతో గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు గురవు తున్నప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదని, ఈ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు, లేదా సంబంధించిన వ్యక్తులు భరోసా ఇచ్చేంతవరకు లారీలను నిలుపుదల చేస్తామని గ్రామంలోని యువత స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీని కలిసిన ఉపాధ్యాయులు

**రణస్థలం:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడును ఉపాధ్యాయ బృందం వినతిపత్రం అందించారు. శనివారం విశాఖలో ఆయనను కలిసి మెమో 57 అమలుకు ప్రభుత్వాన్ని ఒప్పించాలని, జూలై 18న జరగనున్న శాంతియుత నిరసనకు హాజరై సంఘీభావం తెలియజేయాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీల్లో జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎంటిఎస్ టీచర్లకు తగిన న్యాయం చేయాలని కోరినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పిఆర్‌టియు రణస్థలం మండల ప్రధాన కార్యదర్శి బి.చిన్నంనాయుడు, ఎపియుఎస్ మండల అధ్యక్షులు జి.చిన్నికృష్ణం నాయుడు పాల్గొన్నారు.

## తేజేశ్వరరావు పరామర్శ

**కొత్తూరు :** మండలంలోని మెట్టూరు ఉప సర్పంచ్ చక్రపాణి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా ఆకులతంపరలో విఆర్ఒ పసల రామారావు కుటుంబ సభ్యులనూ పరామర్శించారు. ఈయన వెంట బిజెపి మండల అధ్యక్షులు బురాడ భాస్కరరావు, కాపల దమయంతి, చల్లా ఈశ్వర్, గోపాలకృష్ణ, కుమారస్వామి పాల్గొన్నారు.

## సదస్సును విజయవంతం చేయాలి

**టెక్కలి రూరల్ :** ఈ నెల 19న ఒంగోలులో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యాన రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్ కోరారు. ఈ మేరకు పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుడ్డు ప్రభాకర్ ప్రజల హక్కులకు పోరాడుతూ ఆకలి, అంటరానితనం లేని సమాజం కోసం నిరంతరం పోరాటం చేశారని అన్నారు. దళిత, పిడితుల పక్షంగా నిలబడిన ఆయనను రెండేళ్లుగా జైల్లో నిర్బంధించడం అన్యాయమని అన్నామన్నారు. కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, కెఎన్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, బిసి సంఘం నాయకుడు లోక్కోజీ కేశవరావు, ముంజేటి కృష్ణ, రాము, శంకర్, సరోజిని, జానకమ్మ, తులసిబాయి, రామారావు పాల్గొన్నారు.